**2. ప్రశ్నించడం - పరికల్పనలు చేయడం**

- తెలంగాణ పటం చూడండి. మీకు కావలసిన సమాచారం కోసం కొన్ని ప్రశ్నలు రాయండి.

**3. ప్రయోగాలు - క్షేత్ర పరిశీలనలు**

అ) మీ తరగతి గది పటంను అగ్గిపుల్లల సహాయంతో గీయండి. తరగతి గదిలో ప్రదర్శించండి.

ఆ) మీరు మీ బడి నుండి మీ గ్రామంలోని/ప్రాంతంలోని ఏదైనా ఒక ముఖ్య స్థలానికి చేరేటట్లు గుర్తులతో చూపండి. దాన్ని మీ మిత్రుడికి ఇవ్వండి. ఆ ముఖ్యమైన స్థలమేదో గుర్తించగలిగాడా అడగండి. అట్లే, మీ మిత్రుడు రాసిన దాన్ని తీసుకొని మీరు చెప్పండి.


**4. సమాచార నైపుణ్యాలు, ప్రాజెక్టులు**

- మీ చుట్టుపక్కల ఇండ్లకు వెళ్ళండి. మీ పరిశీలనలను కింది పట్టికలో నమోదుచేయండి.

| పరిశీలనలు | నమోదుచేయాల్సిన అంశాలు | | |
|---|---|---|---|
| | 1వ ఇల్లు | 2వ ఇల్లు | 3వ ఇల్లు |
| • ఇంటి గుమ్మం ఏ దిక్కులో ఉంది? | | | |
| • ఇంట్లోని నల్లా / బావి / బోరు బావి / నీటి సంపు ఏ దిక్కు / మూలలో ఉంది? | | | |
| • ఇంట్లో వంట ఇల్లు ఏ మూలన ఉంది? | | | |
| • ఇంట్లో ఖాళీ స్థలం ఏ దిక్కులో ఉంది? | | | |
| • ఇంటికి కిటికీలు, తలుపులు ఏయే దిక్కుల్లో ఉన్నాయి? | | | |
| • ఇంటికి రోడ్డు ఏ వైపున ఉంది? | | | |

- అన్ని ఇళ్ళల్లో ఏర్పాట్లు ఒకేలా ఉన్నాయా?
- నీటి సౌకర్యం, వంట ఇల్లు వంటివి సాధారణంగా అన్ని ఇళ్ళలో ఏ దిక్కు / మూలలో ఉన్నాయి?
- ఇంటిలోని ఏర్పాట్లకు దిక్కులు / మూలలకు మధ్య ఏదైనా సంబంధాన్ని గుర్తించారా?

**5. పటనైపుణ్యాలు, బొమ్మలుగీయడం, నమూనాలు తయారుచేయడం ద్వారా భావ ప్రసారం.**



అ) మీ మిత్రులతో కలిసి మీ పాఠశాల నమూనాను అట్టలతో తయారు చేయండి. దానిలో ఏఏ దిశలో ఏమేమి ఉన్నాయో చూపాలి.

ఆ) మీ ఇంటి పటం గీయండి. వివిధ గదులను గుర్తించండి.

ఇ) మీ గ్రామ పటం గీయండి.

ఈ) మీ మండల పటం గీయండి. మీ గ్రామాన్ని గుర్తించండి.

ఉ) తెలంగాణ పటంలో మీ జిల్లా పేరు రాయండి. మీ జిల్లాను ఆనుకొని ఉన్న జిల్లాల పేర్లను రాయండి.

ఊ) తెలంగాణ పటం ఆధారంగా ఏయే జిల్లాల్లో సముద్రతీరాలు ఉన్నాయో చెప్పండి.

ఋ) తెలంగాణ పటాన్ని మీ నోటుబుక్కులో గీయండి. పై పటంలో జిల్లాల పేర్లు రాయండి, రాష్ట్ర ఎల్లలు రాయండి.

ౠ) మీ జిల్లా పటం గీసి, దానిలో మీ మండలం గుర్తించండి.

**6. ప్రశంస, విలువలు, జీవవైవిధ్యంపట్ల స్పృహకల్గిఉండడం.**

అ) మీరు పటాలను ఏయే సందర్భాలలో వినియోగిస్తారు?

ఆ) పటాల ద్వారా మీరు ఏయే సమాచారం తెల్సుకొంటారో చెప్పండి.

ఇ) పటాల అవసరం ఏమిటి? ఎందుకు?

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | దిక్కులు, మూలల గురించి, అలాగే ఇంటికి, బడికి, గ్రామానికి ఏయే దిక్కుల్లో ఏమి ఉన్నాయో చెప్పగలను. | అవును / కాదు |
| 2. | రాష్ట్ర పటంచూసి తెలియని అంశాల గురించి తెల్సుకొనుటకు ప్రశ్నించగలను. | అవును / కాదు |
| 3. | పాఠశాల నమూనాను అట్టలతో తయారుచేయగలను. | అవును / కాదు |
| 4. | పటాలను అవసరమైన సమాచారాల కోసం వినియోగించగలను. | అవును / కాదు |

# 7  ప్రభుత్వ సంస్థలు

రంగాపురం గ్రామానికి చుట్టూ కొండలున్నాయి. గ్రామానికి దగ్గరలో నది ప్రవహిస్తున్నది. వర్షాలు ఎక్కువగా రావడం వల్ల నదికి వరదలు వచ్చాయి. వరదనీరు రంగాపురం గ్రామంలోకి ప్రవేశించింది. దీని వల్ల గ్రామంలోని వీధులన్నీ నీటితో నిండాయి. వరదలు తగ్గిన తర్వాత వీధులన్నీ బురదతో నిండాయి. కరంట్ తీగలు పడిపోయాయి. నల్లాపైపులు పగిలిపోయాయి. నల్లాల్లో నీళ్ళు రావడంలేదు. గ్రామంలో దీనివల్ల అనేక సమస్యలు నెలకొన్నాయి. ఇలా గ్రామంలోని సమస్యలను ఎవరు తీరుస్తారు? ఎవరు పట్టించుకోవాలి? ఇలా వరదలు వచ్చినప్పుడు గ్రామంలో ఇంకా ఏయే సమస్యలు వచ్చి ఉంటాయి? మొదలగు విషయాల గురించి మీ మిత్రులతో చర్చించండి. రాయండి.

**జట్లలో చర్చించండి :**



- రంగాపురం వీధులలోని బురదను ఎవరు తొలగించాలి?
- కరెంట్ తీగలను ఎవరు బాగు చేయాలి?
- నల్లా / కుళాయి పైపులు ఎవరు బాగు చేస్తారు?
- గ్రామంలో సమస్యలు ఎదురైతే ఎవరికి ఫిర్యాదుచేయాలి?

గ్రామంలోని సమస్యలను పరిష్కరించడానికి, గ్రామంలో సౌకర్యాలను కల్పించడానికి గ్రామ పంచాయితీ ఉంటుంది. గ్రామస్థాయిలో బడి, పశువైద్యశాల, పోస్టాఫీసు అంగన్‌వాడీ కేంద్రం వంటి ఇతర సంస్థలు కూడా ఉంటాయి. వీటివల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. ఇలా సమాజంలోని ప్రజలందరికీ అవసరమయ్యే పనులను చేసే సంస్థలను ప్రభుత్వ సంస్థలంటారు.



## 7.1 ప్రభుత్వ సంస్థలు - గ్రామ పంచాయతీ

మోహన్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయాలనుకున్నాడు. రేషన్ కార్డు తీసుకుంటే రేషన్ సరుకులు వస్తాయి.

కూతురు అరుణను వెంట తీసుకొని గ్రామరెవెన్యూ కార్యదర్శిని కలవడానికి గ్రామపంచాయితీ కార్యాలయానికి వెళ్ళాడు.

"నా పేరు మోహన్ నాకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. నాకు ఆహార భద్రతా కార్డు లేదు. అందుకోసం దరఖాస్తు చేయాలని వచ్చాను" అని చెప్పాడు. తెల్లకాగితంపై దరఖాస్తు రాసి ఇవ్వమని కార్యదర్శి చెప్పారు.

అదే సమయంలో పంటల వివరాల నమోదు కొరకు వచ్చిన వాళ్ళందరినీ లోపలికి రమ్మని గ్రామ కార్యదర్శి పిలిచారు. ఫహాణి (అడంగల్) ఆధారంగా గ్రామరెవెన్యూ సహాయకునితో కలిసి గ్రామ కార్యదర్శి రికార్డులు పరిశీలించి రసీదులు ఇచ్చారు. గ్రామస్థాయిలో గ్రామ కార్యదర్శిలాగే ఇతర అధికారులు కూడా ఉంటారు.

గ్రామ పంచాయతి స్థాయిలో వివిధ అధికారులు చేసే పనులు కొన్ని దిగువ పట్టికలో ఉన్నాయి. ఆ పనులు ఏ అధికారి చేస్తారో టీచరు ద్వారా తెలుసుకొని కింది పట్టికలో నమోదు చేయండి. చర్చించండి.

| క్ర.సం. | పని పేరు | బాధ్యత వహించే అధికారి |
|---|---|---|
| 1. | పంటల వివరాల నమోదు | గ్రామ రెవెన్యూ అధికారి (వి.ఆర్.ఓ.) |
| 2. | ఇంటి పన్ను వసూలు చేయడం | |
| 3. | వీధిలైట్ల ఏర్పాటు | |
| 4. | భూమి వివరాల నిర్వహణ | |
| 5. | జనన మరణాల నమోదు | |
| 6. | రెవెన్యూ కార్యాలయ పనులకు బాధ్యత వహించడం | |
| 7. | మండల పరిషత్తు కార్యాలయ పనులకు బాధ్యత వహించడం | |
| 8. | నల్లా (కుళాయి) బిల్లు వసూలు చేయడం | |
| 9. | ఉత్తరాలు అందించడం | |
| 10. | పాఠశాల నిర్వహణ | |
| 11. | మురికి కాలువల శుభ్రత | |
| 12. | టీకాలు, మందులు ఇవ్వడం | |

**సేకరించండి :**



- మీరు నగరంలో నివసిస్తే పట్టికలో సూచించిన అంశాలకు బాధ్యత వహించే వారి వివరాలను మీ తల్లిదండ్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి. మీ నోటుబుక్కులో రాయండి.
- మీ గ్రామ అభివృద్ధిపై, వివిధ పనులపై గ్రామ పంచాయితీ ఎప్పుడైనా సమీక్ష జరిపిందా? అయితే ఏయే అంశాలపై చర్చించారు? మీ సర్పంచ్ మరియు గ్రామ కార్యదర్శిని కలిసి సమాచారం సేకరించండి.



అరుణ దరఖాస్తు రాసింది. తహసిల్దారు కార్యాలయంవారు ఆన్‌లైన్‌ల్లో వివరాలు నమోదు చేశారు. మోహన్ రాసి ఇచ్చిన వివరాలను తమ దగ్గర ఉన్న సమాచారంతో పరిశీలించారు. వివరాలు జిల్లా పౌరసరఫరాల అధికారికి పంపారు. కొన్ని రోజుల తరవాత వారు ఆహార భద్రత కార్డు మంజూరు చేసి, తహసిల్దారుకు పంపించారు. తహసిల్దారు ద్వారా మోహన్ ఆహార భద్రత కార్డు అందుకున్నాడు. ఇప్పుడు మోహన్ ఆహార భద్రత కార్డు ద్వారా సరుకులు తీసుకుంటున్నాడు.



### మీకు తెలుసా?

ఇటీవల ఆధార్ కార్డు జారీ చేసే సందర్భంలో వ్యక్తుల కళ్ళను ఐరిష్ కెమెరాలో ఫోటో తీస్తున్నారు. మనిషి కనుగుడ్డు పై ఉన్న వలయాకార భాగాన్ని ఐరిష్ అంటారు. ఐరిష్ కెమెరా ఐరిష్ భాగాన్ని ఫోటోతీసి చెదిరి పోకుండా పదిలంగా భద్ర పరుస్తుంది. దీనిని మిమిజోయ్ కనుగొన్నారు. ఒకసారి ఫోటో దిగినవారు మరొక సారి వస్తే ఇది వెంటనే గుర్తిస్తుంది.




### ఇలా చేయండి

- మీ ఇంటిలోని ఆహార భద్రతా కార్డును పరిశీలించండి. ఏయే సమాచారం గమనించారో మీనోటు పుస్తకంలో రాయండి.

ఆహార భద్రత కార్డు ఉన్నవారికి సంబంధిత చౌకధరల దుకాణంలో సరుకులు లభిస్తాయి. ఈ సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం అమ్ముతారు.

### సేకరించండి :



మీ మిత్రులతో కలిసి చౌకధరల దుకాణానికి వెళ్ళండి. కింది సమాచారాన్ని సేకరించండి.

| క్ర.సం. | వివరాలు | ఉంది / లేదు |
|---|---|---|
| 1. | నోటీసు బోర్డు | |
| 2. | పనివేళల బోర్డు | |
| 3. | నోటీసు బోర్డులోని సరుకులు (అమ్మకానికి) | |
| 4. | ధరల పట్టిక | |
| 5. | ఒక నెల సరుకులు తీసుకోకుంటే మరుసటి నెల ఇస్తారా? | |


రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వకుంటే ఏం చేస్తారో తెలుసా? నిరుపేదలకోసం ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణి చేస్తుంది. అవి పేదలకు అందడం చాలా అవసరం. సక్రమంగా అందటం లేదని తెలిస్తే తహసీల్దారుకు ఫిర్యాదు చేయాలి.

## 7.2 ప్రభుత్వ సంస్థలు – మండల కేంద్రం

మండల కేంద్రంలో తహసీల్దారు కార్యాలయం ఉంటుందని తెల్సుకున్నారుకదా! దీన్నే మండల రెవెన్యూ కార్యాలయం అనికూడా అంటారు. ఇది మండల పరిధిలోని గ్రామాల్లోని కుటుంబాలకు రేషనుకార్డులు ఇవ్వడం, భూమిశిస్తు పన్ను (పంటలు పండే భూములకు రైతులు చెల్లించే పన్ను) వసూలు చేయడం వంటి పనులను నిర్వహిస్తుంది. ఇందుకోసం ప్రతిగ్రామంలో తాహసీల్దారు కార్యాలయం పక్షాన పనులు నిర్వహించడానికి ఎవరెవరు ఉంటారో తెలుసా? తెలుసుకొని చెప్పండి. మండల స్థాయిలో తహసిల్దారు కార్యాలయంతోపాటు ప్రజలకు సేవచేయడానికి ఇంకా ఇతర కార్యాలయాలు కూడా ఉంటాయి.

మండల కేంద్రంలో ఇంకా ఏ ఏ సంస్థలు ఉంటాయో తెలుసా? కింది పట్టికలో వివరాలు చదవండి.

| మండల స్థాయిలోని సంస్థ | చేసేపనులు |
|---|---|
| **మండల పరిషత్ కార్యాలయం**  | ♦ ప్రాథమిక విద్యను అందించడం,<br>♦ వ్యవసాయం, పశుపోషణ, చేపలు, కోళ్ళ పెంపకం అభివృద్ధి చేయడం.<br>♦ మండలంలో రోడ్ల నిర్మాణం చేయడం, వాటిని మరమత్తులు చేయడం.<br>♦ సాగునీటి సరఫరా చేయడం.<br>♦ ఆరోగ్యం, శిశు సంక్షేమం, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం మొదలగునవి. |
| **పోలీస్ స్టేషన్**  | ♦ శాంతి భద్రతలు కాపాడటం.<br>♦ నేరాలు జరగకుండా చూడటం.<br>♦ ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడం.<br>♦ ప్రజల ఫిర్యాదులను స్వీకరించడం. తక్షణం స్పందించడం.<br>♦ ఫిర్యాదులపై విచారించడం, రికార్డ్ చేయడం. |

| మండల స్థాయిలోని సంస్థ | చేసేపనులు |
|---|---|
| తహసీల్దారు కార్యాలయం<br> | ♦ గ్రామ రెవెన్యూ అధికారులు మరియు మండలంలోని కార్యాలయ సిబ్బంది పనిని పర్యవేక్షించడం.<br>♦ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను విచారణ చేయడం.<br>♦ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేటట్లు చూడడం.<br>♦ కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం.<br>♦ వెట్టిచాకిరి నుండి ప్రజలను విముక్తులను చేయడం.<br>♦ రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయడం.<br>♦ భూ వివాదాలను పరిష్కరించడం. |
| ప్రాథమిక ఆరోగ్య కేంద్రం<br> | ♦ మండల పరిధిలోని సాధారణ రోగులను ప్రతిరోజూ పరీక్షించడం.<br>♦ ఆరోగ్య ఉపకేంద్రాల నిర్వహణను పర్యవేక్షించడం.<br>♦ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను మండలంలో అమలు చేయడం.<br>♦ మాతా-శిశు సంరక్షణ కింద కాన్పులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే చేయడం.<br>♦ రోగాల తీవ్రతను బట్టి రోగులను జిల్లా ఆసుపత్రికి సిఫారసు చేయడం. |
| బ్యాంకు<br> | ♦ ప్రజల నుండి డిపాజిట్‌లు స్వీకరించడం.<br>♦ మండల పరిధిలో రైతులకు రుణాలు ఇవ్వడం.<br>♦ రోజువారి డిపాజిట్‌లను స్వీకరించడం.<br>♦ మండలంలోని మహిళా సంఘాలకు రుణాలను ఇవ్వడం. |

| మండల స్థాయిలోని సంస్థ | చేసేపనులు |
| --- | --- |
| **మండల వనరుల కేంద్రం**<br> | ♦ మండలంలో వందశాతం బడి ఈడు పిల్లలను బడిలో నమోదుచేయడం.<br>♦ బడిలో చేరిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేలా చూడడం.<br>♦ పాఠశాలను పర్యవేక్షించడం.<br>♦ సకాలంలో హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం.<br>♦ మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా జరిగేటట్లు చూడడం. |
| **పశువైద్యశాల**<br> | ♦ జంతువుల ఆరోగ్యాన్ని సంరక్షించుట.<br>♦ జంతువులకు వచ్చే రోగాలను గుర్తించుట, చికిత్స చేయుట.<br>♦ జంతువుల ద్వారా మానవులకు సంక్రమించే వ్యాధులను గుర్తించి, నివారణ చర్యలు తీసుకొనుట.<br>♦ యజమానులకు జంతువుల పెంపకం గురించి సలహాలు, సూచనలు ఇచ్చుట.<br>♦ జంతువులకు పోషకాహారం ఇవ్వటం గురించి రైతులను చైతన్యం చేయడం. |

మండల కేంద్రంలో ఏయే కార్యాలయాలు మనకు ఎలా ఉపయోగపడతాయో తెల్సుకున్నారు కదా! మండల పరిధిలోని అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ప్రతి మూడునెలలకొకసారి సమావేశాలు జరుగుతాయి. దీంట్లో మండలస్థాయిలోని అన్ని కార్యాలయాల అధికారులు పాల్గొంటారు. ఇది ఎవరి ఆధ్వర్యంలో జరుగుతుందో మీకు తెలుసా? గ్రామానికి సర్పంచ్ ఉన్నట్లే మండలానికి మండల పరిషత్ అధ్యక్షులు ఉంటారు. ఎన్నికలద్వారా ఎంపికైన ఈయన అధ్యక్షతలో అభివృద్ధి సమావేశాలు జరుగుతాయి. గ్రామం, మండలం యొక్క అభివృద్ధి నాయకత్వ లక్షణాలు, సేవాభావం కలిగి ఉన్న గ్రామ సర్పంచ్, మండల అధ్యక్షులు అలాగే గ్రామాల్లో మరియు మండలాల్లో ఉన్న అధికారులపై ఆధారపడి ఉంటుంది.

**ఇలా చేయండి**

- మీ మండలం పేరు ఏమిటి?
- మీ మండలానికి అధ్యక్షుడు / అధ్యక్షురాలు ఎవరు?
- వీరు ఏ గ్రామానికి చెందినవారు?
- మీ మండలంలో అభివృద్ధి సమావేశాలు ఎప్పుడెప్పుడు జరుగుతాయి?
- మీగ్రామం నుండి ఈ సమావేశానికి ఎవరు హాజరవుతారు?
- సమావేశంలో ఏయే అంశాలు చర్చిస్తారు?
- గ్రామపంచాయతీ పనితీరుపై గ్రామంలో ఉన్న ఇతర సామాజిక సంస్థల పనితీరుపై తరగతి గదిలో చర్చించండి.

మండల పరిషత్తు కార్యాలయంలో జరిగే అభివృద్ధి సమావేశాలకు ముందుగానే, మండల అధ్యక్షుల పేరుతో సమాచార లేఖను సభ్యులకు పంపిస్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కొత్తూరు మండల అభివృద్ధి కార్యాలయంవారు సర్వసభ్య సమావేశానికి ఆహ్వానిస్తున్న లేఖను చూడండి.

**మండల అభివృద్ధి అధికారి కార్యాలయం, కొత్తూరు మండలం, మహబూబ్‌నగర్ జిల్లా.**

లేఖ సంఖ్య : 2/బి/2011. తేది : 02-01-2011

**సర్వసభ్య సమావేశానికి ఆహ్వానం**

**విషయం :** తేది : 28-01-2011 నాడు జరిగే సర్వసభ్య సమావేశానికి సభ్యులకు ఆహ్వానం.

– – –

ఇందుమూలంగా మండల అభివృద్ధి అధికారి కార్యాలయం, కొత్తూరు మండలం జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులకు (జెడ్.పి.టి.సి.), మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులకు (ఎమ్.పి.టి.సి.), కో-ఆప్టెడ్ సభ్యులకు మరియు సమస్త గ్రామ పంచాయతీ సర్పంచులకు తెలియజేయునది ఏమనగా మండల పరిషత్ కొత్తూరు సర్వసభ్య సమావేశం తేది:28-01-2011 నాడు ఉదయం 11.30 గంటలకు మండల అభివృద్ధి అధికారి కార్యాలయం, కొత్తూరు నందు జరుపుటకు నిర్ణయించనైనది. కాబట్టి సభ్యులందరూ హాజరు కాగలరని కోరనైనది.

**అధ్యక్షులు**
మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల పరిషత్, కొత్తూరు మండలం,
మహబూబ్‌నగర్ జిల్లా.

సర్వసభ్య సమావేశానికి సంబంధించిన లేఖను చూసారు కదా! దీనికి హాజరయ్యే సభ్యులు ఏయే అంశాల గురించి చర్చిస్తారో తెలుసా? వాటిని ఎజెండా అంశాలు అంటారు. కొత్తూరు సర్వసభ్య సమావేశానికి చెందిన ఎజెండా అంశాలను చదవండి.

**ఎజెండా అంశాలు**

- వ్యవసాయం
- పశు సంవర్ధకశాఖ పనితీరు
- పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి
- పెన్షన్లు
- మంచినీటి పథకం
- పండ్ల తోటలు
- ప్రాథమిక విద్య
- మహిళా శిశు సంక్షేమం
- నీటి నిల్వ పరిరక్షణ
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు
- విద్యుదీకరణ
- గృహ నిర్మాణం
- రోడ్లు మరియు భవనాలు
- పరిశ్రమ మరియు కాలుష్య నివారణ
- ఇతర అంశములు అధ్యక్షుల అనుమతితో

ఎజెండా అంశాలను చూశారు కదా! ఈ సమావేశంలో సభ్యులు ఎవరెవరు హాజరవుతారో, ఏం మాట్లాడతారో మీ మిత్రులతో జట్లలో చర్చించండి.

**జట్లలో చర్చించండి :**



- ♦ మండల పరిషత్ అభివృద్ధి సమావేశాలకు ఎవరెవరు హాజరవుతారు?
- ♦ వీరు ఏయే అంశాల గురించి మాట్లాడవచ్చు?
- ♦ ఒకవేళ మీరే గ్రామానికి సర్పంచ్ ఐతే, మీ గ్రామానికి చెందిన ఏయే అంశాలను మండల అభివృద్ధి సమావేశాల్లో చర్చిస్తారు?

మండలస్థాయి అభివృద్ధి సమావేశాల్లో ఆయా గ్రామాల సమస్యలగురించి సర్పంచులు, ఎం.పి.టి.సి.సభ్యులు చర్చిస్తారు. వాళ్లు అడిగిన ప్రశ్నలకు మండలస్థాయి అధికారులు సమాధానాలు చెపుతారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సమావేశాన్ని నిర్వహించడంలో సహకరిస్తారు. తహసిల్దార్ వ్యవసాయశాఖ అధికారి, పశు వైద్య అధికారి, మండల విద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మొదలగువారు సమావేశానికి హాజరవుతారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు, సంబంధించిన అధికారులు సమాధానాలు చెప్తారు.

**జట్లలో చర్చించండి :**



- ♦ మండల పరిషత్ అభివృద్ధి సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలు కొన్ని పట్టికలో ఉన్నాయి. ఆ ప్రశ్నలు చదవండి. ఈ ప్రశ్నలకు అధికారులు ఏయే సమాధానాలు చెబుతారో జట్లలో చర్చించి రాయండి.

| క్ర.సం. | ప్రశ్నలు | సమాధానం చెప్పే అధికారి |
|---|---|---|
| 1. | రైతులకు విత్తనాలు ఎప్పుడు పంపిణీ చేస్తారు? | |
| 2. | గ్రామానికి ఉన్న రోడ్డు పాడైంది.గతుకులు ఉన్నాయి. రాకపోకలకు కష్టమవుతుంది. ఎప్పుడు బాగు చేస్తారు? | |
| 3. | మా గ్రామంలో మధ్యాహ్నభోజనం వండే వారికి డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారు? | |
| 4. | మా గ్రామంలోని పాఠశాలలో ఆడపిల్లలకు సరిపడినన్ని మూత్రశాలలు లేవు. ఎప్పుడు నిర్మిస్తారు? | |
| 5. | మా బడి పిల్లలకు గ్రంథాలయ పుస్తకాలు కావాలి? | |
| 6. | గ్రామంలోని రైతులకు ఎరువులు కొనడానికి ఋణాలు కావాలి. ఎంత మంజూరు చేస్తారు? ఎలా? | |
| 7. | గ్రామంలో కొంతమంది పేదలకు ఇళ్ళు లేవు. వారికి ఇళ్లను ఎప్పుడు మంజూరు చేస్తారు? | |

## 7.3 ప్రభుత్వ సంస్థలు - జిల్లా కేంద్రం - కలెక్టర్ కార్యాలయం

మోహన్ మరియు కిరణ్ కుటుంబాలు పక్కపక్కనే ఉంటున్నాయి. కిరణ్ తరచుగా అనారోగ్యానికి గురౌతున్నాడు. హఠాత్తుగా ఒకరోజు కింద పడిపోయాడు. ఆయన భార్య జ్యోతి ఏడవటం చూసి మోహన్ వెంటనే '108'కి ఫోన్ చేశాడు. 108 వాహనం వచ్చింది. కిరణ్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.



డాక్టర్లు పరీక్షలు చేసి కిరణ్‌కు గుండెపోటు వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం, తాత్కాలికంగా చికిత్స చేశాం. కాని, నెలరోజుల్లో గుండెకు ఆపరేషన్ చేయాలని చెప్పారు.

ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే ఉచితంగా ఆపరేషన్ చేస్తారని సలహా ఇచ్చారు. దాంతో జ్యోతి తమకు తెల్ల రేషన్ కార్డు ఉన్నందున ఆరోగ్యశ్రీ కార్డు పొందుటకు అర్హత ఉందని తెలుసుకుంది. అందుకోసం జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేయాలని నిర్ణయించుకుంది.కింది విధంగా దరఖాస్తు జిల్లాకలెక్టర్‌కు రాసింది.

**దరఖాస్తు**

తేదీ : 01.01.2013

శ్రీయుత జిల్లా కలెక్టరు,
రంగారెడ్డిజిల్లా,
తెలంగాణ గారికి,

ఆర్యా!

**విషయం :** ఆరోగ్యభీమా చట్టంద్వారా 'ఆరోగ్యశ్రీ' కార్డు ఇచ్చుట గురించి.

– – –

తమరితో మనవి చేయునది ఏమనగా, నా ఆరోగ్యం బాగుండటం లేదు. ఇటీవలె గుండెపోటు వచ్చింది. వైద్య పరీక్షలు చేసి త్వరలోనే ఆపరేషన్ చేయాలని డాక్టరు అన్నారు. ఆపరేషన్‌కు అవసరమయ్యేంత డబ్బు నా వద్ద లేదు.

కావున నాకు ఆరోగ్యశ్రీ కార్డు ఇప్పించగలరని మనవి. కృతజ్ఞతలు

జత చేసిన పత్రాలు

1) ఆధార్ కార్డు
2) వైద్య పరీక్షల నివేదికలు

ఇట్లు
భవదీయ
కిరణ్
గ్రామం : పట్లూర్, మం: మర్పల్లి,
జిల్లా : రంగారెడ్డి, తెలంగాణ.

మరుసటి రోజు కిరణ్ కుటుంబం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళి కలెక్టర్‌ను కలిసి మొత్తం విషయం చెప్పారు. దరఖాస్తు అందించారు. జిల్లా కలెక్టరుగారు ఆ దరఖాస్తును ఆరోగ్య భీమా విభాగ అధికారికి పంపించారు. వారంరోజుల్లో ఆరోగ్యశ్రీ కార్డును సంబంధిత అధికారి కిరణ్‌కు అందజేశాడు. ఆరోగ్యశ్రీ కార్డుతో కిరణ్ ఉచితంగా వైద్యం చేయించుకున్నాడు. సంపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా ఇంటికి వచ్చారు. మన అవసరాలు తీర్చడానికి

**సేకరించండి :**



- జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంతోపాటు ఇంకా ఏ ఏ కార్యాలయాలు ఉన్నాయో మీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొని పట్టికలో రాయండి.

| క్ర.సం. | జిల్లా స్థాయి కార్యాలయం పేరు | అధికారిపేరు | చేసే ముఖ్యమైన పనిపేరు |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |
| | | | |

జిల్లా స్థాయిలో అనేక కార్యాలయాలు ఉంటాయి. వీటి ద్వారా మండల, గ్రామస్థాయిలో నిర్వహించే పనులకు నిధులు విడుదల చేస్తారు. జిల్లాస్థాయిలో జిల్లాలోని ప్రజలందరికీ ఉపయోగపడే ఇతర సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉంటాయి.

గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు వివిధ ప్రభుత్వ సంస్థలు ప్రజల అవసరాలను తీర్చడానికి పనిచేస్తున్నాయి. సంస్థలలోని అధికారులు తమకు కేటాయించిన పనులు చేస్తారు.

**జట్లలో చర్చించండి :**



- సమ్మె, బంద్‌లు, ధర్నాలు, రాస్తారోకోలు చేసే సందర్భాలలో కొందరు ప్రభుత్వ కార్యాలయాలకు, బస్సులకు నష్టం కలిగిస్తారు. ప్రభుత్వ ఆస్తికదా! మాదేమి పోతుందనుకుంటారు. ప్రభుత్వ ఆస్తి అంటే ఎవరిది? ఎవరికి నష్టం?
- ఈ సంస్థలకు డబ్బు ఎక్కడి నుండి వస్తుంది? ఎవరు ఇస్తారు?
- ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ఉండాలంటే మనమేం ఏంచేయాలి?

## 7.4 ప్రభుత్వ సంస్థలు - ప్రభుత్వ ఆస్తి

ప్రభుత్వ సంస్థలు పౌరుల ప్రాథమిక అవసరాలను తీరుస్తాయి. ఈ పనుల కోసం డబ్బు అవసరం. సంస్థలు పనిచేయడానికి (నిర్వహించుటకు) కార్యాలయాలు, ఉద్యోగులు, వారికి వేతనాల వంటి వాటికి డబ్బు అవసరం.

ప్రభుత్వ సంస్థలు వాటి నిర్వహణ మరియు వివిధ పనులకోసం ఖర్చు చేసే డబ్బు మనదే! మనమందరం ప్రభుత్వానికి వివిధ పన్నులు, రుసుముల పేరిట డబ్బు చెల్లిస్తున్నాము. ఆ డబ్బుతోనే ప్రభుత్వం మన అవసరాలను తీరుస్తుంది. ప్రభుత్వ ఆస్తి అంటే అది మన ఆస్తే! దానిని కాపాడుకొని, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిది. లేదంటే అభివృద్ధి జరగదు. పౌరులమైన మనం బాధ్యతగా ప్రవర్తించాలి. దేశం మనది, ఆస్తులు మనవి.

వీధిదీపాలు, నీటి పంపులు, పంచాయితీ కార్యాలయం, వైద్యశాల ఇవన్నీ మన కోసమే కదా! పగలుకూడా

వీధి దీపాలు వెలగడం, నల్లా పాడైపోయి నీరు వృథాగా పోతుండడం ప్రభుత్వకార్యాలయాల వరండాలు, తలుపులు కిటికీలు పాడుచేయడం అంటే మనకు మనమే నష్టం కలిగించుకోవడమని అర్థం. ఇవన్నీ మనవే. వీటిని మనమే కాపాడుకోవాలి. ఎవరైనా నష్టం చేయడానికి పూనుకుంటే మనం అడ్డుపడాలి. ఇదే బాధ్యతాయుతమైన పౌరులు చేయాల్సిన పని.

## 7.5 సమాచార హక్కు

అమ్మ : ఏం రవి, ఆట స్థలానికి వెళ్ళకుండా కొన్ని రోజుల నుండి ఇంటి ముందు ఆడుకుంటున్నారేమిటి?

రవి : అబ్బా! అక్కడ మురికి కాలువ పొంగి గ్రౌండ్‌లోకి నీరు పారుతూ దుర్వాసన వస్తోందమ్మా!

అమ్మ : వాసన వస్తే మురికి కాల్వ సమస్య గురించి పంచాయితీ ఆఫీసులో ఫిర్యాదుచేద్దాం. మురికి కాలువ శుభ్రం చేసే వ్యక్తులెవరో, వారు రోజూ ఏయే పనులుచేస్తున్నారో తెలుసుకోకుండా ఇలా ఇంటి ముందు ఆడుకుంటే ఎలా?

రాజు : పిన్నీ! ఈ సమస్య గురించి మా అన్నయ్య ఐదు రోజుల కిందనే పంచాయితీ ఆఫీసులో వివరాల కోసం దరఖాస్తు చేశాడు.

అరుణ : పిన్నీ! సమాచారం అడిగితే వారు పట్టించుకుంటారా?

అమ్మ : 12 అక్టోబరు 2005 సంవత్సరం నుండి సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది. అప్పటి నుండి ప్రజలు అడిగే సమాచారం గురించి అందరూ పట్టించుకుంటున్నారు.

### సమాచార హక్కు చట్టం - 2005

ప్రభుత్వ కార్యాలయాల నుండి కోరుకున్న సమాచారాన్ని మనం పొందడానికి ఉద్దేశించిన చట్టమే సమాచార చట్టం. ప్రభుత్వ కార్యాలయాల్లోని రికార్డులు, పత్రాలు, మెమోలు, ఉత్తర్వులు, నివేదికల గురించి అవసరమైన వివరాలు తెల్సుకునే హక్కు మనకుంది. ఇందుకోసం అవసరమైన దరఖాస్తును అధికారికి ఇవ్వాలి. ఈ చట్ట ప్రకారం, మనం రాతపూర్వకంగా సంబంధిత అధికారి నుండి వివరాలు పొందవచ్చు.

దరఖాస్తును తెల్లకాగితంపై కూడా రాసి ఇవ్వవచ్చు. నామమాత్రపు దరఖాస్తు రుసుం చెల్లించాలి. గ్రామస్థాయిలో సమాచారం పొందుటకు రుసుం లేదు. దారిద్రరేఖకు దిగువన ఉన్నవారు దరఖాస్తు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా సంబంధిత అధికారి సమాచారం అందించాలి. జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించినదైతే 48 గంటల్లో సమాచారం ఇవ్వాలి.

కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో సమాచార కమీషన్ స్వతంత్రంగా పనిచేస్తుంది. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి ఉంటారు. కార్యాలయాల నోటీసుబోర్డులలో ఏ సమాచారాన్ని, ఎంతకాలంలో ఇస్తారో తెలుపుతారు.

ప్రజలందరూ ప్రభుత్వంలో భాగమే. ప్రతి కార్యాలయం పనితీరు గురించి, అవసరమైన సమాచారం కోరే హక్కు అందరికీ ఉంది. ప్రభుత్వ యంత్రాంగం స్వచ్ఛందంగా ప్రజలకు సమాచారం అందించాలన్నదే చట్టం ప్రధానోద్దేశం.

అరుణ : పిన్నీ! సమాచార హక్కు చట్టం అంటే ఏమిటి?

అమ్మ : ప్రజాసంస్థల నుండి సమాచారం పొందే హక్కునే సమాచార హక్కు అంటారు. దీనిలో భాగంగా మనం ప్రభుత్వం చేపడుతున్న పనులు, పత్రాలు, నివేదికలు మొదలగు వాటికి సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు. వాటి నకలు (కాపీలు) ప్రతులు పొందవచ్చు.

రవి : అమ్మా! మన గ్రామంలో అన్ని ఆఫీసులలో వివరాలు అందుబాటులో ఉంచుతారా?

అమ్మ : తప్పని సరిగా ఉంచాలి. సమాచారం అందుబాటులో ఉంచడం అధికారుల బాధ్యత. అడిగి

## సమాచారం కోసం దరఖాస్తు

తేదీ : ______________

ప్రజా సంబంధ అధికారి (గ్రామ కార్యదర్శి),
గ్రామ పంచాయితీ కార్యాలయం,
బిజ్వారం (గ్రామం),
మల్దకల్ (మండలం),
మహబూబ్‌నగర్ (జిల్లా).
ప్రజా సమాచార అధికారి గారికి,

### సమాచారం కోసం విన్నపం

సమాచార హక్కుచట్టం 2005, సెక్షన్ 6(1) ప్రకారం కింది సమాచారాన్ని సెక్షన్ 4(4) కింద తెలుగు / హిందీ / ఆంగ్లంలో ప్రతిపేజీని సెక్షన్ 2(జె) (ii) ప్రకారం ధృవీకరించి ఇవ్వగలరు.

2012-13 సంవత్సరంలో గ్రామపంచాయితికి వచ్చిన నిధుల గురించి కింది వివరాలు అందించగలరు.

2012-13 సంవత్సరంలో వచ్చిన నిధులు మొత్తం ______________ రూపాయలు.

వాటిని ఏయే పనులకు, ఎంతెంత ఖర్చు చేసారు? ______________

ఖర్చు చేయగా డబ్బులు మిగిలినవా? ______________

మిగిలినచో ఎన్ని రూపాయలు మిగిలినవి? ______________

దరఖాస్తు రుసుం రూ. 10/- చలాన రూపంలో చెల్లిస్తున్నాను. రసీదు ఇవ్వగలరు.

దరఖాస్తుదారుని సంతకం

పేరు : వెంకట్

**చిరునామా :** వెంకట్
గ్రా : బిజ్వారం
మం : మల్దకల్
జి : మహబూబ్‌నగర్

తెలుసుకోవడం మన హక్కు.

అరుణ : పిన్నీ! అడిగి తెలుసుకోవాలన్నారు కదా! మరి ఎవర్ని అడగాలి?

అమ్మ : భలే ప్రశ్నవేశావు అరుణ! కార్యాలయాలలో ప్రజా సమాచార అధికారిని అడిగి తెలుసుకోవచ్చు. సమాచార వివరాలు డాక్యుమెంటుల (పత్రాల) రూపంలో కూడా పొందవచ్చు.

రాజు : పిన్నీ! మా అన్నయ్య మురికి కాలువ శుభ్రం చేసేవారి వివరాల గురించి ఐదు రోజుల కిందటే పంచాయితీ ఆఫీసులో దరఖాస్తు ఇచ్చాడు కదా! ఆ విషయం ఏమైందో ఇప్పుడు మేము అడిగి తెలుసుకోవచ్చా?

అమ్మ : తెలుసుకోవచ్చు. 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలి.

అరుణ : 30 రోజులలో సమాచారం ఇవ్వకపోతే?

అమ్మ : వారి పై అధికారికి అప్పీలు చేసుకోవాలి. తెల్ల కాగితం తీసుకురండి. దరఖాస్తు ఎలా రాయాలో చెపుతాను. (అమ్మ చెప్పినట్లు పిల్లలు తెల్ల కాగితం మీద రాసి అమ్మతో కలిసి గ్రామ కార్యదర్శిని కలుస్తారు)

రాజు, రవి, అరుణ, అమ్మ : నమస్తే సార్! మిమ్మల్ని కలుద్దామని వచ్చాం సార్!

గ్రామ కార్యదర్శి : పిల్లలూ! ఏం కావాలి మీకు?

అమ్మ : సార్! వీళ్లు రోజూ ఆడుకునే గ్రౌండ్‌లోకి ప్రక్కనే ఉన్న మురికి కాలువ నీరు పారుతూ దుర్వాసన వస్తోంది. దీని గురించి రాజు వాళ్ళ అన్నయ్య ఐదు రోజుల క్రితమే సమాచారం అడిగాడు.

గ్రామ కార్యదర్శి : పనివాళ్ళు మురికి కాలువను రోజూ శుభ్రంచేస్తున్నారు కదా!

రాజు : లేదు సార్. చాలా రోజుల నుండి మురికి కాలువను ఎవరూ శుభ్రం చేయడం లేదు.

అరుణ : అసలు మురికి కాలువను ఎవరు శుభ్రం చేస్తారు? ఎన్ని రోజులకు ఒకసారి శుభ్రం చేస్తారు?

గ్రామ కార్యదర్శి : ఈ వివరాలన్నీ మీకెందుకు?

అమ్మ : అలా అనకండి. సమాచారహక్కు చట్టం ప్రకారం అడిగి తెలుసుకునే హక్కు అందరికీ ఉంది. పిల్లలూ దరఖాస్తు ఇవ్వండి.

గ్రామ కార్యదర్శి : (దరఖాస్తు తీసుకుని) సరే, వెళ్ళండి మీరు.

పి : మరి రసీదూ!

**జట్లలో చర్చించండి :**



- సమాచార హక్కు చట్టాన్ని ఏయే సందర్భాల్లో మనం ఉపయోగించుకోవచ్చు?
- మీ గ్రామంలోని సమస్యల గురించి ఏం సమాచారం తెలుసుకోవాలని కోరుకుంటున్నారు? ఇందుకోసం దరఖాస్తు రాయండి.

**కీలక పదాలు :**

| | | |
|---|---|---|
| 1. ప్రభుత్వ సంస్థ | 6. గ్రామపంచాయతీ | 11. రేషన్ కార్డు |
| 2. సరుకులు | 7. మండల పరిషత్తు | 12. ఆరోగ్యశ్రీ కార్డు |
| 3. ఫిర్యాదు | 8. కలెక్టరు కార్యాలయం | 13. ప్రభుత్వ ఆస్తి |
| 4. నివేదికలు | 9. సర్వసభ్య సమావేశం | 14. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం |
| 5. ఋణం | 10. మండల పరిషత్ అధ్యక్షులు | 15. పశువైద్యశాల |

## మనం ఎంతవరకు నేర్చుకున్నాం?

**1. విషయావగాహన**

అ) ప్రభుత్వ సంస్థలు అని వేటిని అంటారు? కొన్ని ఉదాహరణలు రాయండి.

ఆ) మీ గ్రామపంచాయతీ ఏయే పనులను చేస్తుంది?

ఇ) మీ గ్రామంలో ఏయే సమస్యలు ఉన్నాయి? గ్రామపంచాయతీ వాటిని తీరుస్తుందా?

ఈ) మీ మండలం పేరు ఏమిటి? అక్కడ ఏయే కార్యాలయాలు ఉన్నాయి?

ఉ) మీ జిల్లా పేరు ఏమిటి? మీ జిల్లా కేంద్రం ఎక్కడ ఉంది? అక్కడ ఏయే కార్యాలయాలు ఉన్నాయి?

ఊ) మండల అభివృద్ధి కార్యాలయాలు, తహసీల్దారు కార్యాలయాలు చేసేపనుల్లో తేడాలు ఏమిటి?

ఋ) ప్రతి కుటుంబానికి ఒకటి కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఇవ్వరు, ఎందుకు?

ౠ) సమాచార హక్కువల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి? మీరు ఏ సమాచారం తెలుసుకోవాలని అనుకుంటున్నారు?

ఎ) మీ గ్రామంలో ఏ సమస్యల గురించి తెలుసుకోవడానికి మీరు సమాచార హక్కును వినియోగించుకుంటారు?

**2. ప్రశ్నించడం - పరికల్పనలు చేయడం**

- జిల్లా కేంద్రంలో ఉండే ఏదైనా ఒక కార్యాలయం పేరు రాయండి. ఆ కార్యాలయం ద్వారా ప్రజలకు ఏయే మేలు జరుగుతుందో తెలుసుకోవాలి. ఇందుకోసం ఏయే ప్రశ్నలు అడుగుతారు?

**3. ప్రయోగాలు - క్షేత్ర పరిశీలనలు**

- మీ ఊరిలోని ప్రభుత్వ సంస్థలకు వెళ్ళి, అవి ఏయే పనులు చేస్తున్నాయో తెలుసుకొని రాయండి.

**4. సమాచార నైపుణ్యాలు, ప్రాజెక్టులు**

- గ్రామపంచాయతీ లేదా మండల కేంద్రంలోని ఏదైనా ఒక కార్యాలయానికి వెళ్ళండి. ఆ కార్యాలయంలో ఎవరెవరు ఉంటారు? ఏయే పనులు చేస్తారు? ఆ కార్యాలయం ద్వారా ప్రజలకు చేకూరే ప్రయోజనాలేమిటి? వివరాలు సేకరించండి. ప్రదర్శించండి.

**5. పటనైపుణ్యాలు, బొమ్మలుగీయడం, నమూనాలు తయారుచేయడం ద్వారా భావ ప్రసారం.**

అ) మీ మండలం పటం గీయండి. మీ మండలంలో ఏయే సంస్థలు ఉన్నాయో గుర్తించండి.

ఆ) మీ జిల్లా పటంలో మీ మండలాన్ని గుర్తించండి. దీనికి ఆనుకొని ఇంకా ఏయే మండలాలు ఉన్నాయో గుర్తించండి.

ఇ) మీ ఊరిలో ఏయే కార్యాలయాలు ఉన్నాయో ఒక్కోదానికి ఒక గుర్తును సూచిస్తూ మీ ఊరి పటం గీయండి.

ఉదా: బడి △ దవాఖానా +

పోస్టాఫీసు P బ్యాంకు ○

**6. ప్రశంస - విలువలు, జీవవైవిధ్యంపట్ల స్పృహకల్గిఉండడం.**

అ) ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ సంస్థలు, ప్రజల ఆస్తులు వీటికి నష్టం వాటిల్ల కుండా మనం ఏయే పనులు చేయవచ్చు?

ఆ) మీ పాఠశాల ఒక ప్రభుత్వ సేవాసంస్థ కదా! మరి మీరు మీ పాఠశాలలో చేయాల్సినవి, చేయకూడని పనులను రాయండి.

ఇ) గ్రామంలో నిర్వహించే గ్రామసభకైనా, బడిలో జరిగే తల్లిదండ్రుల సమావేశాలకైనా తల్లిదండ్రులు హాజరుకావాలి. అప్పుడే అక్కడ ఏం జరుగుతుందో తెలుస్తుంది. మీ తల్లిదండ్రులు, తప్పకుండా సమావేశాలకు హాజరయ్యేలా మీరు ఏం చేస్తారు?

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | గ్రామం నుండి జిల్లా వరకు ఎక్కడెక్కడ ఏయే సంస్థలు ఉంటాయో చెప్పగలను. | అవును / కాదు |
| 2. | వివిధ సంస్థల వల్ల ప్రజలకు జరిగే మేలును వివరించగలను. | అవును / కాదు |
| 3. | జిల్లా పటంలో, మండల పటంలో కార్యాలయాలను గుర్తించగలను. | అవును / కాదు |
| 4. | ఏదైనా సంస్థ నుండి సమాచారాన్ని సేకరించడానికి అవసరమైన ప్రశ్నలు అడగగలను. | అవును / కాదు |
| 5. | మండల పటంలో ఎక్కడెక్కడ ఏయే సంస్థలు ఉన్నాయో గుర్తించగలను. | అవును / కాదు |
| 6. | ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల ఆస్తి కాబట్టి వీటిని కాపాడడానికి మనమేం చేయాలో వివరించగలను. | అవును / కాదు |

# 8  ఇళ్ళనిర్మాణం - పారిశుధ్యం

మనం నివసించడానికి ఇళ్ళు అవసరం. గ్రామాల్లోను, పట్టణాల్లోను రకరకాల ఇళ్ళు ఉంటాయి. కింది చిత్రంలో కొన్ని ఇళ్ళు ఉన్నాయి. వాటిని పరిశీలించండి.



**జట్లలో చర్చించండి :**



- చిత్రంలో ఏఏ రకాల ఇళ్ళు ఉన్నాయి?
- మీ ఊళ్ళో ఏఏ రకాల ఇళ్ళు ఉన్నాయి?
- ఇళ్ళు వివిధ రకాలుగా ఉండడానికి కారణం ఏమిటి?

## 8.1. ఇళ్ళు - నాడు - నేడు

గతంతో పోలిస్తే ఇళ్లు ఎన్నో మార్పులు చేర్పులకు లోనైనాయి. గతంలో ప్రజలు ఎక్కడ, ఎలాంటి ఇండ్లలో నివసించేవారో తెలుసా?

యాదగిరి తాపీ మేస్త్రి. గత 20 సంవత్సరాలుగా ఇళ్ళు కడుతున్నాడు. పల్లెల్లోనూ, పట్నంలోనూ రకరకాల ఇళ్ళు కట్టాడు. 20 సంవత్సరాల నుండి వందలాది ఇళ్ళు కట్టిన యాదగిరి, ఇళ్ళ నిర్మాణంలో వచ్చిన మార్పుల గురించి ఏం చెపుతున్నాడో చూద్దాం!



నా చిన్నప్పుడు మా అమ్మ, నాన్న మా ఇల్లు కట్టారు. మాది మట్టితో కట్టిన ఇల్లు. నేను, మా అక్క కూడా ఇల్లు కట్టడానికి సహాయం చేశాం. మట్టిని నీటితో కలిపి ముద్దలుగా చేశాం. ఈ మట్టి ముద్దలనే పేర్చుతూ గోడ కట్టారు. నాలుగు గోడలు, ఆరడుగుల ఎత్తు లేచిన తర్వాత నల్లమద్ది దూలాలపైన, వెదురు గడలను పరిచి తాటి ఆకుల కప్పువేశాం. ఒక వేప మొద్దుని కోసి వడ్రంగి సత్తయ్యతో తలుపులు, కిటికీలు చేయించాం. వీటిని గోడల్లో అమర్చారు. మా అమ్మ గది గోడలను, నేలను పేడతో అలికి ముగ్గులు పెట్టేది. శుభకార్యాల సమయంలో గోడలకు మేమే సున్నం వేసే వాళ్ళం. ఆ రోజుల్లో మా ఇల్లు కట్టడానికి సామగ్రి అంతా స్థానికంగానే దొరికేది. మా ఇల్లు చల్లగా ఉండేది.

**జట్లలో చర్చించండి :**



- యాదగిరి వాళ్ళు ఇల్లుకట్టడానికి ఏ ఏ సామాగ్రి వాడారు? ఇందులో ఏమేమి కొని ఉంటారు? ఏవి ఉచితంగా దొరికి ఉంటాయి?
- నాటి కాలంలో కట్టిన మట్టిఇంటికి, నేటి కాలంలోని ఇండ్లకు గల తేడాలు ఏమిటి?
- ఈనాటి కాలంలో కూడా మట్టితో ఇండ్లు కడుతున్నారా? లేదా ఎందుకు?

## 8.2 మట్టిమిద్దెలు

నేను 18 ఏండ్లకే తాపి మేస్త్రీని అయ్యాను. మొదట్లో మట్టి మిద్దెలు కట్టేవాణ్ణి. మిద్దెల గోడలు మట్టితో కట్టేవాళ్ళం. పైకప్పుకూడా మట్టితోనే వేసే వాళ్ళం. అప్పట్లో ఇసుక, సున్నాన్ని 'గానుగ'లో వేసి బాగా తిప్పిన తర్వాత వచ్చిన మిశ్రమాన్ని ఉపయోగించి గోడలు కట్టేవాళ్ళం. పాత కాలం నాటి కోట గోడలు కూడా రాళ్ళు, సున్నంతో కట్టినవే!

ఆ రోజుల్లో నేను కాల్చిన ఇటుకలు, సున్నంతో చాలా డాబాలు కట్టాను. ఈ డాబాలలో వంటగది, ధాన్యం గదులు ఉండేవి. గోడలను ఇసుక, సున్నం మిశ్రమంతో ప్లాస్టరింగ్ చేసే వాళ్ళం. టేకు, మద్దికర్ర, వేగిస దూలాలు పేర్చి బెంగుళూరు పెంకుతో పై కప్పు వేసేవాళ్ళం. నేలపైన తాండూరు, షాబాద్ బండలను వేసేవాళ్ళం. ఇంటి చుట్టూ ఖాళీస్థలం ఎక్కువ వదిలేవాళ్ళం. ప్రతి ఇంట్లోనూ వేప చెట్టు పెంచేవారు. ఇంటి ముందు వీధి అరుగులు ఉండేవి. రాత్రివేళ ఎక్కువ మంది ఆరుబయట మంచాలు వేసుకొని నిద్రించేవారు.

ఇంటిముందు వీధిఅరుగులు ఉండటంవల్ల ఉపయోగమేమిటి?

బాగా డబ్బున్న వాళ్లు డాబా ఇల్లు కట్టుకునేవారు. ఆ ఇంటి గోడలు ఇటుకలతో కట్టేవాళ్ళం.

దీనిపై సిమెంటుతో ప్లాస్టరింగ్ చేసేవాళ్ళం. పైకప్పును సిమెంటు, కంకర, ఇసుక కలిపిన కాంక్రీటు మిశ్రమంతో స్లాబు వేసేవాళ్లం.



## జట్లలో చర్చించండి :



- ఇటుకతో గోడలు కట్టేటప్పుడు ఇటుకలను ఎలా పేర్చుతారు?
- డాబాలు కట్టడానికి ఏ సామగ్రి వాడతారు? ఆ సామగ్రి ఎక్కడ లభించేవి?
- డాబా నిర్మాణానికి ఏయే పనులు చేసేవారు అవసరం అవుతారు?

ఈ మధ్య నేను ఒక డూప్లెక్స్ ఇల్లు కట్టాను. ఇంటి యజమాని పేరు చక్రపాణి. స్థలం 36 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు ఉంది. ఇంజనీరుతో ఇంటిప్లాను గీయించాడు.






## ఆలోచించండి...

చక్రపాణి ఇంటి ప్లాను పరిశీలించండి. మొదటి అంతస్తులో ఏమున్నాయో చెప్పండి.

మొదట సిమెంట్ కాంక్రీట్‌తో బెడ్‌వేసి, ఇనుప ఊచల్లో కాంక్రీటు వేసి పిల్లర్లు పోశాం. సిమెంట్ ఇటుకలతో గోడలు కట్టాం. విచిత్రం ఏమిటంటే మేం వాడిన సిమెంట్ ఇటుకలు చాలా తేలికగా ఉండి నీళ్ళలో వేస్తే తేలుతున్నాయి. స్లాబు వేసేందుకు లిఫ్ట్, వైబ్రేటర్ వాడాం. గోడలను మొదట సిమెంట్‌తో ప్లాస్టరింగ్ చేసి, తర్వాత వాల్‌కేర్ పెట్టి మరింత నునుపు చేశాం. గదులు చల్లగా ఉండడానికి పైకప్పు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ షీట్లతో సీలింగ్ చేశాం. నేలపై రాజస్థాన్ నుండి తెప్పించిన చలువరాతి బండలు వేశాం. వంటగదిలో, బాత్‌రూంలో సిరామిక్‌టైల్స్ వేశాం.

అయితే ఈ ఇల్లు కట్టడానికి నా నైపుణ్యం సరిపోలేదు. టైల్స్ వేయడానికి, బండలు వేయడానికి, సీలింగ్ చేయడానికి, రంగులు వేయడానికి, పైపులు బిగించడానికి నైపుణ్యం ఉన్న కార్మికులు చాలా మంది అవసరమైనారు. ఇంటి పైన అమర్చిన సౌరశక్తి ఫలకాలతో ఇంటికి కావలసిన కరెంటు తయారు అవుతున్నది. నీళ్ళు వేడి అవుతున్నాయి. ఉన్న స్థలం మొత్తం ఇల్లు కట్టడానికే సరిపోయింది. ఇంటి పై కప్పుపై ప్లాస్టిక్ షీట్లు పర్చి, మట్టితో మడులను చేసి కూరగాయలు, పూల మొక్కలు పెంచేలా ఏర్పాటుచేశాం. దీన్నే రూఫ్ గార్డెన్ అని పిలుస్తున్నారు.


**ఆలోచించండి...**

- డూప్లెక్స్ ఇల్లుకు మామూలు డాబా ఇంటికి మధ్యగల తేడాలు ఏమిటి?
- రూఫ్ గార్డెన్ అంటే ఏమిటి? దీన్ని పెంచడంలో ఉద్దేశం ఏమిటి?

## 8.3 ఇంటినిర్మాణం ఎలా జరుగుతుందో తెల్సుకుందామా!

మీ సమీప ప్రాంతంలో నిర్మిస్తున్న ఏదైనా ఇంటివద్దకు వెళ్ళండి. వివరాలు సేకరించి రాయండి.

**సేకరించండి :**



- ఎలాంటి ఇల్లు నిర్మిస్తున్నారు? ఎంత స్థలంలో నిర్మిస్తున్నారు?
- ఎంత మంది పనిచేస్తున్నారు? ఎవరెవరు ఏ పనులు చేస్తున్నారు?
- పని చేస్తున్న వారికి రోజుకూలీ ఎంత ఇస్తారు? (ఎవరైనా ముగ్గుర్ని అడిగి రాయండి)
- ఇంటి నిర్మాణానికి ఏఏ సామగ్రి ఉపయోగిస్తున్నారు? ఏ పనిముట్లు వాడుతున్నారు?
- ఈ సామగ్రిని ఎలా తీసుకువచ్చారు? (ట్రాక్టర్/లారీ/ఆటో/ఎడ్లబండి/రిక్షాబండి/ఇతరములు).
- ఒక గదిని నిర్మించడానికి ఎన్ని ఇటుకలు, ఎన్ని బస్తాల సిమెంటు కావాలి?
- ఒక గదిని నిర్మించడానికి సుమారు ఎంత ఖర్చు అవుతుంది?

## 8.4 ఇటుకలను తయారు చేసే విధానం

ఇళ్ళు కట్టడానికి ఎక్కువగా మట్టి ఇటుకలనే వాడుతున్నారు. తేలికగా, ధృడంగా, ఎర్రని రంగులో ఉన్న నాణ్యమైన ఇటుకలకు గిరాకి ఉంటుంది. మరి ఈ ఇటుకలను ఎలా తయారు చేస్తారో తెలుసా? ఇటుకలను తయారు చేసే వివిధ దశల గురించి తెలుసుకుందాం!



**ఇటుకలు తయారు చేయడంలో కింది దశలుంటాయి :**



- బంక మట్టిని సేకరించడం.
- బంకమట్టిని బూడిదతో కలపడం.
- దీనిని నీటితో కలిపి పశువులతో తొక్కించి మెత్తగా చేయడం.
- మట్టి ముద్దలను ఇటుక ఆకారంలోని అచ్చులలో వేసి, తీయడం.
- పచ్చి ఇటుకలను రెండు రోజుల పాటు ఎండబెట్టడం.
- ఎండిన ఇటుకలను బట్టీలలో పేర్చి కట్టెలు, వరిపొట్టుతో కాల్చడం.(ఇటుకబట్టి 30 రోజుల వరకు కాలుతుంది.)
- ఇటుక ఎర్రగా కాలగానే వారం రోజులు చల్లార్చి, తర్వాత ఇండ్లు కట్టేవారికి అమ్మడం.

## జట్లలో చర్చించండి :



ఇటుకను ఎలా తయారుచేస్తారో తెలుసుకున్నారు కదా! కింది చిత్రాలు చూడండి. ఇటుకల తయారీలోని దశలను చిత్రాల కింద రాయండి.




1. ______________________



2. ______________________



3. ______________________



4. ______________________



5. ______________________



6. ______________________

ఇంటి నిర్మాణానికి, ఇటుకలతోపాటు రాళ్ళు, కలప, సిమెంటు, కంకర, ఇనుప చువ్వలు, టైల్సు మొదలగునవి కూడా అవసరమౌతాయి. వీటి గురించి తెలుసుకుందాం.

## 8.5 ఇంటి నిర్మాణం - ఇతర సామగ్రి

ఇల్లు కట్టడంలో ఇటుకలతో పాటు పునాదికి వాడే రాళ్ళు, నేలపై పరిచే బండలు మనరాష్ట్రంలోని తాండూరు, బేతంచర్ల, ఖమ్మంలలో రంగు రంగుల్లో లభిస్తున్నాయి.



తాండూరు బండలు





రాజస్థాన్ చలువరాతి బండలు



షాబాద్ బండలు



ఖమ్మం గ్రానైట్

కాంక్రీటు మిశ్రమం తయారు చేయడానికి కంకర రాళ్ళు అవసరమౌతాయి. ఇందుకోసం క్రషర్లను ఉపయోగిస్తారు. పెద్దపెద్ద రాళ్ళను మెషీనులో వేసి చిన్నచిన్న కంకర రాళ్ళుగా చేస్తారు. ఈ పనులు చేసే కార్మికులు అవసరమైతే అక్కడనే నివాసాలు ఏర్పరచుకొంటారు. వారితోపాటు వారి పిల్లలు కూడా అక్కడే ఉంటారు.



స్టోన్ క్రషర్ మెషీన్



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

**ఆలోచించండి...**

- కార్మికుల పిల్లలు బడికి వెళతారా? వారు చదువుకోకుంటే ఏమవుతుంది?
- ఇటుక బట్టీలు, ఇళ్ళ నిర్మాణ స్థలాలలో ఉండే కార్మికులకు కావలసిన వసతులు ఏవి? ఏవిధంగా సమకూర్చాలి?

## 8.6 అపార్ట్‌మెంటు నిర్మాణం



పట్టణాలలో స్థలం ఖరీదు చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల తక్కువ స్థలంలో, ఎక్కువ ఇండ్లు ఉండే పెద్ద పెద్ద అపార్టుమెంటులు నిర్మిస్తారు. ఒక్కొక్క అపార్ట్‌మెంటులో 25-30 కుటుంబాలుండేలా నిర్మిస్తారు. ఒక్కో కుటుంబం ఉండేదాన్ని 'ఫ్లాట్' అంటారు. ఈ మధ్య కాలంలో చాలా ఎక్కువ కుటుంబాలు అనగా 50 కంటే ఎక్కువ కుటుంబాలు నివసించేలా అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. అపార్టుమెంట్ల నిర్మాణానికి ఏయే పరికరాలు ఉపయోగిస్తారో తెలుసా? కింది పరికరాలను పరిశీలించండి.



కంకర మిశ్రమం కలిపే యంత్రం



క్రేన్



పైకి సామగ్రిని తీసుకొని వేళ్ళే యంత్రం (లిఫ్ట్)

**జట్లలో చర్చించండి :**



- అపార్ట్‌మెంట్‌లు ఎందుకు అవసరం? వాటి ఉపయోగాలు ఏమిటి?
- వాటిని అంత ఎత్తుగా ఎలా నిర్మించి ఉంటారో ఆలోచించండి.
- అంత ఎత్తుకు నిర్మాణ సామగ్రిని ఎలా చేరవేసి ఉంటారు?

**ఆలోచించండి...**

**అపార్టుమెంట్లకు, సాధారణ ఇళ్లకు గల తేడాలు చెప్పండి.**

సాధారణంగా అపార్టుమెంట్లలో కింద పాలరాయి లేదా టైల్స్‌ను పరుస్తారు. మీ ప్రాంతంలో ఇవి లభిస్తాయా? ఇవి మీ ప్రాంతానికి ఎక్కడి నుండి, ఎలా వచ్చాయో తెల్సుకొని చెప్పండి.

సాధారణంగా ఇంటికి చెక్కతో చేసిన తలుపులు, కిటికీలు ఉంటాయి. ఈ మధ్యకాలంలో ఇనుముతో చేసిన వాటిని కూడా వాడుతున్నారు. అపార్టుమెంట్లవంటి వాటిలో ప్లైవుడ్‌తో చేసిన తలుపులను వాడుతున్నారు. కిటికీలకు, తలుపులకు అద్దాలను కూడా వాడుతున్నారు.

**ఆలోచించండి...**

**తలుపులు, కిటికీలు మొదలగువాటికి కర్రకు బదులుగా ఇతర సామగ్రిని ఎందుకు వాడి ఉంటారు?**

## 8.7 ఇండ్లు-వివిధ ప్రాంతాలు

వేడిమి, వర్షపాతం, లభించే సామగ్రిని బట్టి ఇళ్ళను నిర్మిస్తారు. మనదేశంలోని వివిధ ప్రాంతాలలో ఉండే ఇళ్ళను గురించి తెలుసుకుందాం!

ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, నాగాలాండ్‌లలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. చిత్తడి వాతావరణం ఉంటుంది. 1826 సంవత్సరంలో బ్రిటిష్ వారు ఇక్కడ ఇండ్లను కట్టడం ప్రారంభించారు. చెక్క ఇండ్లు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తాయి. వెదురు బొంగులను పేర్చి గోడవలె ఉపయోగిస్తారు. వీటికి ఆవు పేడను కలిపిన బంకమట్టిని పూస్తారు. ఇండ్ల పై కప్పులు రేకులతో ఏటవాలుగా ఉంటాయి. కింది భాగంలో స్లిట్స్ నిర్మిస్తారు. వర్షపునీరు వెళ్ళే మార్గాన్ని 'స్లిట్' అంటారు.



**ఆలోచించండి...**

**ఇండ్ల పైకప్పులను రేకులతో ఏటవాలుగా ఎందుకు నిర్మిస్తారు?**

కాశ్మీర్ బాగా చలి ప్రదేశం. ఇక్కడ ఉష్ణోగ్రతలు ఒక్కోసారి $0^0$ కన్నా తక్కువకు పడిపోతాయి. ఇక్కడ పర్వతాలపై ఇండ్లు ఉంటాయి. శ్రీనగర్‌లోని జీలం నదిపై 'డోంగా' అనే పడవ ఇళ్ళలో యాత్రికులు విహరిస్తారు.



**మీకు తెలుసా?**

మనరాష్ట్రంలో తాండూరుప్రాంతంలో రంగుబండలు లభిస్తాయి. ఈ ప్రాంతంలో రాళ్ళు చవకగా లభిస్తాయి కాబట్టి ఇంటిగోడలు, పైకప్పు, ఫ్లోరింగ్ మొత్తం రాళ్ళతోనే నిర్మిస్తారు. రాతికప్పు! విచిత్రంగా లేదూ! అదే విధంగా సముద్రతీర ప్రాంతాలలో కొబ్బరి ఆకులనూ, నల్లమల, మన్యం అడవుల్లో వెదురును ఇంటి నిర్మాణానికి విరివిగా ఉపయోగిస్తారు.



## 8.8 ఇండ్లు - సమస్యలు

మనం నివసించడానికి ఇళ్ళు అవసరం కదా! అయితే మన చుట్టూ ఉండేవాళ్ళలో కొంత మందికి సొంత ఇళ్ళుండవు. వీరు అద్దె ఇళ్ళలో లేదా తాత్కాలిక నివాసాల్లో ఉంటారు. మన రాష్ట్రంలో ఉన్న పేదలకు కూడా సొంత ఇళ్ళు లేవు. వీరికి ప్రభుత్వం ఇళ్ళు కట్టించి ఇస్తుంది.

**జట్లలో చర్చించండి :**



- పిల్లలూ! మీ అందరికీ సొంత ఇళ్ళు ఉన్నాయా? మీది ఏరకమైన ఇల్లు?
- ప్రతి ఒక్కరికి సొంత ఇళ్ళు ఎందుకు ఉండవు?
- సొంత ఇళ్ళు లేనివారికి ఏఏ సమస్యలు ఉంటాయి?
- ఇళ్ళు ఎలా ఉంటే మీకిష్టం? ఏయే సౌకర్యాలు ఉండాలి?
- ఇంటి సౌకర్యాలలో ఇలా వ్యత్యాసాలు ఉండడానికి కారణాలు ఏమై ఉంటాయి?

పట్టణాలలో పేదలు కాలువ కట్టలు, నదుల ఒడ్డున, ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లోనూ గుడిసెలు వేసుకొని నివసిస్తుంటారు. హైదరాబాద్‌లోని ఒక మురికి వాడ చిత్రాన్ని పరిశీలించండి. ప్రజలు మురికి వాడల్లో ఎందుకు నివసిస్తారు?



**ఆలోచించండి...**

**మురికివాడలు ఇంత అపరిశుభ్రంగా ఎందుకు ఉంటాయి?**

## 8.9 ఆరుబయట మలవిసర్జన



గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ చాలా ఇండ్లలో మరుగుదొడ్లులేవు. కొందరికి మరుగుదొడ్లు ఉన్నప్పటికీ ఆరు బయటనే మలవిసర్జన చేస్తున్నారు. ఇది ఒక చెడు అలవాటు. దీని వల్ల అనేక నష్టాలు ఉన్నాయి. మలం మీద వాలిన ఈగల వల్ల క్రిములు వ్యాప్తి చెందుతాయి. కాలువకట్టలు, చెరువు గట్లవద్ద మలవిసర్జన చేసినప్పుడు, వర్షం ద్వారా అది నీటిలోకి చేరుతుంది. ఇలా కలుషితమైన నీరు తాగే నీటిలో కలిసిపోతే ఆ నీటిని తాగినపుడు, ఆహారం తిన్నప్పుడు కలరా, టైఫాయిడ్ వంటి జబ్బులు వ్యాపిస్తాయి. ఆరుబయట మలవిసర్జన వల్ల నులిపురుగులు (ఏలికపాములు) వ్యాప్తి చెందుతాయి. వీటినే నట్టలు అంటారు. కడుపులో నట్టలు ఉంటే

రక్తహీనత ఏర్పడుతుంది. మనం తిన్న ఆహారం అవే తీసుకుంటాయి. మనం బలహీనంగా ఉంటాం. సంవత్సరానికి రెండుసార్లు కడుపులో పురుగులు పోవడానికి డీవార్మింగ్ మాత్రలు వేసుకోవాలి.

## 8.10 సంపూర్ణ పారిశుధ్య ఉద్యమం

అందరికీ మరుగుదొడ్డి సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నది. బలహీన వర్గాల వారికి మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం చేస్తున్నది. మీ ఊరిలో ఈ సౌకర్యం ఎంతమంది ఉపయోగించుకున్నారు?



**ఇంట్లో మరుగుదొడ్డి ఉంటేనే కాపురానికి వెళ్తానన్న అనితాబాయి :-**

ఫోటోలోని మహిళ పేరు అనితాబాయి. ఈమెది మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలోని చిచౌలి గ్రామం. 2011 మేలో రతన్‌పూర్ గ్రామానికి చెందిన శివరాంతో పెళ్ళి అయింది. అత్తగారింట్లో అడుగుపెట్టిన అనితాబాయికి అక్కడ మరుగుదొడ్డి లేకపోవడంతో ఇబ్బంది అయింది. మరుగుదొడ్డి లేని కారణంగా అనితాబాయి తన పుట్టింటికి వెళ్ళి, అత్తగారింట్లో మరుగుదొడ్డి కట్టిస్తేనే మళ్ళీ కాపురానికి వెళ్తానని చెప్పింది. దానిగురించి వాళ్ళ కుటుంబంలో, గ్రామంలో చర్చ జరిగింది. అనితాబాయి చెప్పింది సబబే అని అందరూ అన్నారు. అప్పుడు అనితాబాయి అత్తవారింట్లో మరుగుదొడ్డి కట్టారు. అలాగే ఆ గ్రామంలో మిగిలిన వారు కూడా మరుగుదొడ్లు కట్టించుకున్నారు. ఈ విధంగా అనితాబాయ్ పారిశుధ్య విప్లవానికి కారకురాలైంది. ఈ సంఘటన జాతీయస్థాయిలో ప్రాచుర్యం పొందింది. కేంద్ర ప్రభుత్వం ఈమెకు 'సులభ్ శానిటేషన్ అవార్డు' క్రింద రు. 5,00,000 చెక్కును అందించింది. నాటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్, ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కూడా ఈమెను అభినందించారు.



**కేంద్రమంత్రి శ్రీ జైరాం రమేశ్ గారి నుండి నగదు బహుమతిని తీసుకుంటున్న అనితాబాయి.**

**మీకు తెలుసా?**

100 శాతం పారిశుధ్యం ఉన్న గ్రామాలు అనగా ప్రధానంగా గ్రామంలోని అన్ని ఇండ్లలో మరుగుదొడ్డి సౌకర్యం ఉండి, గ్రామంలో పారిశుధ్యం సరిగా ఉంటే ఆ గ్రామానికి 'నిర్మల్ పురస్కార్' అవార్డు లభిస్తుంది. దీన్ని అమలుపరిచినందుకు రాష్ట్రపతి చేతుల మీదుగా బహుకరిస్తారు. మీజిల్లా/మండలంలో ఇలా నిర్మల్ పురస్కార్ అవార్డు పొందిన గ్రామాలు ఎన్ని ఉన్నాయో తెల్సుకొని చెప్పండి.



**భారత రాష్ట్రపతి నుండి నిర్మల్ పురస్కారాన్ని స్వీకరించడం**

## 8.11 పారిశుధ్యం – అవసరం



ఆరోగ్యమే మహాభాగ్యమని అంటారు. అపరిశుభ్రత వల్లనే అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయి. మన ఆరోగ్యానికి అపరిశుభ్రత ప్రథమశత్రువని చెప్పవచ్చు. పక్క చిత్రం చూడండి. ఏం జరుగుతుందో చెప్పండి. దీనివల్ల ఎలాంటి నష్టం వాటిల్లుతుంది?

**జట్లలో చర్చించండి :**



- చెత్తను పై చిత్రంలో మాదిరిగా పారవేయడం సరైందేనా? ఆలోచించండి.
- అపరిశుభ్ర పరిసరాల వల్ల కలిగే నష్టాలను చర్చించండి.
- మీ ఇంట్లో/పాఠశాలలోని చెత్తను మీరు ఏం చేస్తారు?
- చెత్తను తిరిగి ఏ విధంగానైనా వినియోగించుకోవచ్చా? చర్చించండి.
- మనం ఇళ్ళలో చెత్తను తగ్గించాలంటే ఏం చెయ్యాలి?

## 8.12 ఇంట్లో చెత్త

మీ ఇంట్లో పోగయ్యే వ్యర్థాలను పరిశీలించండి. దీంట్లో ఏమేమి ఉన్నాయి? ఆహార పదార్థాలు, ఆకులు, పండ్లతొక్కలు, కవర్లు, అట్టముక్కలు, ప్లాస్టిక్ కవర్లు మొ॥నవి. వాటిలో కొన్ని తడిగాను మరియు కొన్ని పొడిగాను ఉంటాయి.

తడిచెత్త త్వరగా కుళ్ళిపోయి మట్టిలో కలుస్తుంది. అందుకే దీన్ని కంపోస్టు గుంతలో వేయాలి. పొడిచెత్తను రీసైకిల్ చేసే అవకాశం ఉంటుంది. మున్సిపాలిటీవారు పట్టణాలలో తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించే ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపల్ వాహనం మీ ఇంటివద్దకు వచ్చినప్పుడు తడి, పొడి చెత్త డబ్బాలను వారికి అప్పగించాలి.

ఇంటి పరిసరాలలో, పాఠశాలలో పోగైన చెత్తను, ఆకులను కుప్పగా చేర్చి కాల్చడం సరికాదు. దీనివల్ల గాలి కలుషితం అవుతుంది. రేకు, గాజు, ప్లాస్టిక్ లాంటివి అలాగే మిగిలిపోతాయి. ఇలా చేయడం పర్యావరణానికి హానికరం.

**ఆలోచించండి...**

మీ ఇంట్లో ఏఏ రకాల చెత్త ప్రోగవుతుంది? వాటిలో తడి చెత్త ఏది? పొడి చెత్త ఏది? ఆ చెత్తను మీరేం చేస్తారు?

**మీకు తెలుసా?**



చండీగడ్‌లో లేక్‌చంద్ అనే వ్యక్తి ప్రజలు పారేసిన చెత్తను సేకరించి దాన్ని నిర్మాణ సామగ్రిగా మార్చి అందమైన 'రాక్ గార్డెన్' నిర్మించాడు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ఎంత ముఖ్యమో, చెత్తను లేకుండా చేయడమూ అంతే ముఖ్యం. మన ఇళ్ళలో తయారయ్యే చెత్తను ఎలా తగ్గించవచ్చో ఆలోచించండి. పర్యావరణ పరిరక్షణకై ఈ మూడు సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలి.

1. **చెత్తను తగ్గించడం :** కావలసిన వస్తువులను తగిన మోతాదులో కొని దాన్ని పూర్తిగా వాడడం ద్వారా చెత్తను తగ్గించవచ్చు లేదా పూర్తిగా నివారించవచ్చు. ఉపయోగించి పారవేసే అనగా ప్లాస్టిక్ నీటిగ్లాసులు, ప్లేట్లు, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ టీగ్లాసులు, ప్లాస్టిక్ చెంచాల వంటివి వాడకూడదు. అవి ఒక్కరోజు / ఒక్కసారి వాడి పారవేయడం వల్ల ఎక్కడ చూసిన ఇవి కుప్పలుగా తయారయ్యాయి. వాటి వల్ల వాతావరణకాలుష్యం, నీటిలో వేయడం వల్ల కరగక, నీటి కాలుష్యం జరిగి నీటిలో ఉన్న మొక్కలు, చేపలు చనిపోతున్నాయి. ప్లాస్టిక్ బదులుగా స్టీలు, లోహంతో చేసిన వాటిని వాడాలి. వీటిని మళ్ళీమళ్ళీ ఉపయోగించవచ్చు. పడవేయాల్సిన అవసరం ఉండదు.

2. **తిరిగి వాడడం :** పరికరాలను రిపేరు లేదా రీఫిల్లింగ్ చేసి వాడాలి. సంచులు, కవర్ల వంటివి పారేయకుండా తిరిగి వాడవచ్చు. ఇలా చేయడంవల్ల ప్లాస్టిక్ వాడకం తగ్గించినట్లవుతుంది.

3. **రీ సైక్లింగ్ :** ఇనుము, ప్లాస్టిక్, గాజు, కాగితం, ఎలక్ట్రానిక్ పరికరాలను రీ ప్రాసెసింగ్ చేసి మళ్ళీ కొత్త వస్తువులు తయారు చేస్తారు. ఇలా రీసైక్లింగ్ చేయడంవల్ల కూడా చెత్తను తగ్గించవచ్చు.

**చేసి చూడండి...**

మీ పాఠశాలలో కంపోస్టు గుంతను ఏర్పాటుచేయండి. దానిలో చెట్ల ఆకులు, పండ్ల తొక్కలు మొదలైన చెత్తను వేయండి. మట్టికప్పండి. నెలరోజుల్లో ఏర్పడిన కంపోస్టును బడితోటలోని మొక్కలకు వేయండి.

## 8.13 శుభ్రమైన ఇల్లు ఎలా ఉండాలి?



చిత్రంలోని ఇల్లు ఎలా ఉంది? పచ్చని మొక్కలు, పరిశుభ్రత, గాలి, వెలుతురు ధారాళంగా లభించే ఇల్లు ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇంటిముందు, వెనక ఖాళీ స్థలం ఉండాలి. ఇలా ఏ లక్షణాలు ఉంటే అది మంచి ఇల్లు అవుతుంది?

**కీలక పదాలు :**

| | | |
|---|---|---|
| 1. తాపీమేస్త్రి | 6. అపార్టుమెంటు | 11. రూఫ్ గార్డెను |
| 2. ఇంటి నిర్మాణం | 7. మట్టి మిద్దెలు | 12. ఇటుక బట్టీలు |
| 3. పెంకుటిల్లు | 8. ఇంటిపైకప్పు | 13. స్టోన్ క్రషర్, క్రేన్ |
| 4. డాబా | 9. ఇంటిప్లాను | 14. మురికివాడలు |
| 5. తడి చెత్త | 10. సిమెంటు కాంక్రీటు | 15. పారిశుధ్యం |

## మనం ఎంతవరకు నేర్చుకున్నాం?

### 1. విషయావగాహన

అ) మీ ప్రాంతంలో ఏయే రకాల ఇళ్లున్నాయి ?

ఆ) ఇంటి నిర్మాణంలో స్థానికంగా దొరికే, ఇతర ప్రాంతాల నుండి తెచ్చే సామగ్రిని పట్టికలో రాయండి.

ఇ) ఇంటి నిర్మాణంలో ఎవరెవరు పాల్గొంటారు? వారిని ఏమంటారు?

ఈ) చాలా మందికి ఇప్పటికీ సొంత ఇండ్లు లేవు. ఎందువల్ల?

ఉ) బహుళ అంతస్తుల భవనాలు ఎందుకు నిర్మిస్తున్నారు? వీటివల్ల ఉపయోగాలు రాయండి.

ఊ) మీ ఇళ్ళు పరిశుభ్రంగా ఉండాలంటే నీవు ఏమి చేస్తావు?

ఋ) నివసించే ఇంటిని బట్టి వారు పేదవారో, ధనికులో చెప్పవచ్చా? ఎలా?

### 2. ప్రశ్నించడం - పరికల్పనలు చేయడం

అ) శ్రీధర్ ఈ మధ్యన మోటర్ సైకిల్‌పై భారతదేశ యాత్ర చేసి వచ్చాడు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఎలాంటి ఇండ్లు ఉన్నాయో తెలుసుకోడానికి నీవు శ్రీధర్‌ను ఏ ఏ ప్రశ్నలు వేస్తావు?

ఆ) బిలాల్ ఇల్లు కట్టించాలని అనుకుంటున్నాడు. ఇంటి నిర్మాణం గురించి తాపీ మేస్త్రిని ఏ ఏ ప్రశ్నలు అడిగి ఉంటాడో రాయండి.

### 3. ప్రయోగాలు - క్షేత్ర పరిశీలనలు

ఏదైనా ఒక ప్రభుత్వం సహాయంతో కట్టిన ఇంటిని పరిశీలించి పట్టిక పూరించండి.

అ) బేస్‌మెంట్ ఎత్తు ____________ అడుగులు

ఆ) గదుల సంఖ్య ____________

ఇ) నీటి సౌకర్యం ఉన్నది / లేదు

ఈ) మరుగుదొడ్డి ఉన్నది / లేదు

ఉ) ప్రహరిగోడ ఉన్నది / లేదు ఉంటే పొడవు ____________ అడుగులు

**4. సమాచార నైపుణ్యాలు, ప్రాజెక్టులు**

- మీ సమీపంలోని ఐదు ఇండ్లకు వెళ్ళి సమాచారం సేకరించి రాయండి.

| క్ర.సం. | కుటుంబ యజమాని పేరు | చెత్తను ఎక్కడ వేస్తున్నారు? | | | |
|---|---|---|---|---|---|
| | | పెంట కుప్ప | చెత్తకుండి | గోడ పక్కన | రోడ్డు మీద |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |

**5. పటనైపుణ్యాలు, బొమ్మలుగీయడం, నమూనాలు తయారుచేయడం ద్వారా భావ ప్రసారం**

అ) మీరు ఉంటున్న ఇంటి ప్లాను గీయండి. దాంట్లో ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో గుర్తించండి.

ఆ) అందమైన, పరిశుభ్రమైన ఇల్లు ఎలా ఉంటుందో ఊహించండి. ఆ ఇంటి బొమ్మను చార్టుపై గీయండి. రంగులు వేయండి. ఇంటి గురించి ఐదారు వాక్యాలు రాయండి. ప్రదర్శించండి.

**6. ప్రశంస, విలువలు, జీవవైవిధ్యంపట్ల స్పృహకల్గిఉండడం.**

అ) ఇంటి నిర్మాణానికి చాలా మంది కార్మికుల శ్రమ అవసరం కదా! వారి శ్రమ శక్తిని నీవు ఎలా అభినందిస్తావు?

ఆ) మీ ప్రాంతంలో ఉన్న మంచి ఇల్లు ఎవరిది? అది ఎందుకు మంచి ఇల్లు కారణాలు రాయండి.

ఇ) మీ ఇల్లు మొక్కలు, పక్షులు, జంతువులతో కళకళలాడుతూ ఉండడానికి మీరేం చేస్తారు?

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | ఇంటి నిర్మాణం గురించి, అవసరమైన సామగ్రి గురించి, రకరకాల ఇళ్ళ గురించి వివరించగలను. | అవును / కాదు |
| 2. | ఇల్లు, ఇంటి నిర్మాణాన్ని గురించి తాపీ మేస్త్రిని ప్రశ్నలడగగలను. | అవును / కాదు |
| 3. | సమీపంలోని ఇండ్లకు వెళ్ళి సమాచారాన్ని సేకరించి పట్టికలో రాసి వివరించగలను. | అవును / కాదు |
| 4. | మా ఇంటి ప్లానును, అందమైన ఇల్లు బొమ్మను గీసి వివరించగలను. | అవును / కాదు |
| 5. | కార్మికుల శ్రమను అభినందించగలను. జీవవైవిధ్యంకోసం కృషిచేయగలను. | అవును / కాదు |

9



# మా ఊరు – మా చెరువు

నా పేరు వరలక్ష్మి. మాది వ్యవసాయ కుటుంబం. మా తాత, ముత్తాతల నుండి వ్యవసాయం చేస్తున్నాం. మా వ్యవసాయానికి ఆధారం నాగుల చెరువు. గత రెండు సంవత్సరాలుగా నాగుల చెరువు నిండలేదు. అందుకే వర్షాల మీద ఆధారపడిన పంటలు వేయవలసి వచ్చింది.

**మిత్రులతో చర్చించండి – రాయండి.**

| చెరువు నిండినపుడు వేసే పంటలు | చెరువు నిండనపుడు వేసే పంటలు |
| --- | --- |
| | |

గత రెండు సంవత్సరాలనుండి వర్షాలు సరిగ్గా లేక, వరిపైరు సరిగా పండలేదు. దీంతో చెరువు కింద ఎప్పుడూ వేసే వరి పంట బదులు జొన్న, పల్లీలు (వేరుశనగ), ఉలవలు, తైదలు (రాగులు) వేశాం. నీళ్ళు సరిపోక ఆ పంటలు కూడా సరిగ్గా పండలేదు.

**ఆలోచించండి...**

**వర్షాలు సరిగ్గా కురవకుంటే ఏం జరుగుతుంది?**

ఈ సంవత్సరం కూడా ప్రారంభం నుండి వర్షాలు కురవలేదు. కాని మూడు రోజుల నుండి మాత్రం వానలు విపరీతంగా కురుస్తున్నాయి. ఈ వర్షాలు పంటలు వేయడానికి ఎంతో అనుకూలం.

వాన ఆగితే నాగుల చెరువు దగ్గరకు వెళదామనుకుంటున్నాను. కాని చెరువుకు వెళ్లే దారిలో ఉన్న లద్దమడుగు అనే చిన్న కాలువ పారడం వల్ల దాన్ని దాటలేక నాగుల చెరువు దగ్గరకు వెళ్లడం కుదరలేదు.

పిల్లలూ! వర్షాకాలంలో చిన్న చిన్న కాలువలు, వాగుల్లో ప్రవాహం వేగంగా ఉంటుంది.

అందుకే వాటిలో దిగరాదు. దిగితే ప్రవాహానికి కొట్టుకుపోతారు. మీరుకూడా దిగవద్దు జాగ్రత్త!

మధ్యాహ్నం తర్వాత వాన కొంత తగ్గింది. ఎండ వచ్చింది. సన్నగా చినుకులు రాలుతున్నాయి. ఆకాశంలో ఇంద్రధనుస్సు కనిపించింది.


తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

తొందర తొందరగా నాగుల చెరువుకు చేరుకున్నాను. అప్పటికే అక్కడ హన్మయ్య, సత్యప్ప, రాంగోపాల్ నాయక్, పుల్లప్ప, మన్నెపురెడ్డి ఉన్నారు. గౌరి, అన్నపూర్ణ కూడా వచ్చారు. వరద నీరు చెరువులోకి వస్తున్నది. చెరువు నిండి మత్తడి (అలుగు) పారుతున్నది.



మత్తడి అంటే ____________________

____________________

చెరువు నిండడం, వరద నీరు, మత్తడి పారడం, వేయబోయే పంటలు, చెరువు కట్ట గట్టిదనం గురించి అందరం మాట్లాడుకున్నాం. ఈ సారి రెండు పంటలు వేయవచ్చున్న ఆనందంతో కొందరు పొలాల వైపు, మరికొందరు ఇంటి వైపు వెళ్లారు.

నేను కూడా చెరువు కట్ట దిగి పొలాల వైపు వెళుతుంటే నరహరి కనిపించాడు. మా ఊరితో పాటు, చుట్టు పక్కల గ్రామాలలోని ప్రతి కుటుంబం గురించి, చెరువులు, పండే పంటలు, దేవాలయాలు ఇలా అన్ని విషయాల గురించి అతనికి తెలుసు. అతను ఎప్పుడూ చెరువు గురించి పాత విషయాలు చెబుతూ ఉంటాడు.

**సేకరించండి :**



మీ చుట్టు పక్కల ఏఏ చెరువులున్నాయి? వీటి వల్ల ఎలాంటి మేలు జరుగుతుంది?

| చెరువు ఉన్న ఊరు | చెరువు పేరు | ఉపయోగం |
|---|---|---|
| | | |

## 9.1 నాగుల చెరువు చరిత్ర:

నా పేరు నరహరి. మాకు నాగుల చెరువు కింద కొంత పొలం ఉంది. వ్యవసాయం చేస్తాం. కాని గ్రామ చరిత్రను చెప్పడం మా ప్రధాన వృత్తి. మా తాత, ముత్తాతల నుండి ఈ పని చేస్తున్నాం. నాగుల చెరువు గురించి నాకు బాగా తెలుసు. మా నాన్న, తాత, ముత్తాతలు కూడా ఎన్నో విషయాలు ఈ చెరువు గురించి చెప్పారు. నిండుగా ఉన్న చెరువును చూస్తే ఆ విషయాలన్నీ గుర్తుకు వస్తుంటాయి.

ఇపుడు నాగుల చెరువు ఉన్న చోట గతంలో పెద్ద కుంట ఉండేది. ఏ కొంచెం పెద్ద వాన కురిసినా అది పూర్తిగా నిండేది. కుంటకు ఉన్న చిన్న అడ్డుకట్ట ద్వారా కింది పొలాలకు నీరు వదిలేవారు. కుంట కింద ఉన్న కొంత మంది పొలాలకే ఈ నీరు సరిపోయేది. మల్లికార్జున్ అనే రైతు అన్ని పొలాలకు నీరు అందేటట్టుగా చేయాలని తహసిల్దార్‌ను కలిశాడు. ఇంజనీర్ అబ్దుల్‌బారి ఆ కుంట చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించి కుంటను చెరువుగా మార్చడానికి ప్రణాళికలు తయారు చేశాడు.

**ఆలోచించండి...**

**కుంటకు, చెరువుకు మధ్య తేడాలేవి ?**

## 9.2 చెరువు నిర్మాణం:

చెరువు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రతి కుటుంబం నుండి అందరూ బాధ్యతగా పనుల్లో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రజలంతా ఒక్కటై చెరువు నిర్మాణంలో పాల్గొన్నారు.

ముందుగా వరద నీరు ఎక్కడి నుండి వస్తుందో పరిశీలించారు.

వరద అంటే ________________________________________

________________________________________________

వరద నీరు బాగా వచ్చే ప్రాంతాల నుండి నేరుగా కాలువలు తవ్వి కుంటకు కలిపారు. తర్వాత చెరువు కట్ట కట్టడం మొదలు పెట్టారు. ఎడ్ల బండ్లలో చుట్టు పక్కల గ్రామాల నుండి మట్టిని తీసుకువచ్చి, ఎత్తుగా కట్టను కట్టారు. లోపలి వైపు రాళ్ళను పేర్చి కట్టారు. ఇందుకు ఊరి బయటి గుట్ట నుండి రాళ్లను కొట్టి తెచ్చారు. చెరువు కట్టకు రెండు వైపులా చివరి భాగంలో రెండు తూములు కట్టారు.

**ఆలోచించండి...**

**తూము అంటే ఏమిటి?**

**చెరువులకు తూములు ఎందుకుంటాయి?**





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

తూములు కట్టే సమయంలో ఇంజనీర్ అబ్దుల్‌బారి స్వయంగా వచ్చి ఆ పని పూర్తి చేశారు. చెరువులో నీరు ఎంత చేరింది? ఎంత ఉంటే నీటిని పొలాలకు వదలాలో తెలియజేసే కొలతను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అది తెల్ల పెయింట్‌తో ఉంది. తూమును తిప్పే విధానం అప్పట్లో అందరూ ఆశ్చర్యంగా చూసేవారట. తూము దిమ్మెను పైకి లాగితే చెరువు నీరు కాలువలోకి పారుతుంది. తూము దిమ్మెను కిందికి వదిలితే నీరు వెళ్లడం ఆగుతుంది.

**మీకు తెలుసా?**

కొన్ని చెరువులు ఒకదానికొకటి కాలువలతో కలిపి ఉంటాయి. వర్షాకాలంలో ఒక చెరువు నిండితే ఎక్కువైన నీరు కాలువ గుండా మరో చెరువుకు చేరుతుంది. కాకతీయులు, నిజాం రాజులు ఇలాంటి గొలుసు కట్టు చెరువులను తెలంగాణ అంతటా నిర్మించారు.

తూముల నిర్మాణం పూర్తయ్యాక అలుగు పని ప్రారంభమయ్యింది. చెరువు నిండిన తర్వాత ఎక్కువయిన నీరు పోవడానికి వీలుగా చెరువుకు ఒక వైపు మొత్తం రాళ్లతో అలుగు కట్టారు. పై నుండి నీరుపడే చోట నేల కోతకు గురికాకుండా పెద్ద పెద్ద రాళ్లు ఉంచారు. గ్రామంలోని మేస్త్రీలు దీని కొరకు ఎంతో కష్టపడ్డారు. చెరువు కట్టేటప్పుడు అందరికి భోజనం ఒకే చోట వండేవారు. మధ్యాహ్న సమయంలో అందరూ ఒకే దగ్గర కూర్చొని తినేవారు. ఇంకా ఏఏ పనులు ఎలా చెయ్యాలో చర్చించుకునేవారు. తర్వాత కాలువలు తవ్వడం మొదలు పెట్టారు. రెండు తూముల నుండి వచ్చిన నీరు నాలుగు కాలువల ద్వారా అన్ని పొలాలకు అందేటట్లుగా కాలువలు తవ్వారు. తర్వాత కాలంలో ఈ కాలువలను రాళ్లు, సిమెంట్‌తో కట్టారు.

**జట్లలో చర్చించండి :**



- చెరువు నిర్మాణంలో తూము, కాలువలు, అలుగులు ఎందుకు అవసరం ?

చెరువు కట్టిన మరుసటి సంవత్సరం వానలు బాగా కురిసాయి. చెరువు కింద ఉన్న మొత్తం పొలాల్లో వరి పంట వేశారు. పంటలు బాగా పండడంతో ప్రజల జీవితం మెరుగుపడింది. వారి జీవితాల్లో పెద్ద మార్పు వచ్చింది. మా కుటుంబానికి కూడా ఆర్థిక ఇబ్బందులు తొలిగాయి.

**సేకరించండి :**




- మీ దగ్గరలోని చెరువును ఎలా నిర్మించారో వివరాలు సేకరించి రాయండి.
- మీ పరిసరాలలో ఉన్న చెరువులను దర్శించి అవి ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో రాయండి.

## 9.3 రాష్ట్రంలోని పెద్ద చెరువులు

నాగుల చెరువులాగే మన రాష్ట్రంలో ఎన్నో చెరువులు ఉన్నాయి. రాష్ట్రంలోని కొన్ని పెద్ద చెరువుల గురించి తెలుసుకుందాం!

### 9..3.1 రామప్ప చెరువు

వరంగల్ జిల్లాలో రామప్ప దేవాలయం దగ్గరలో రామప్ప చెరువు ఉంది. ఇది మానవ నిర్మిత చెరువు. 13వ శతాబ్దంలో నిర్మించిన ఈ చెరువు 24 చ.కి.మీ. విస్తరించి ఉంది. చుట్టు పక్కల ఉండే వ్యవసాయ భూములకు ఈ చెరువు ఆధారం. ఈ చెరువు చుట్టూ అడవులు, కొండలు ఉన్నాయి. ఈ చెరువు పక్కన ఉన్న రామప్ప దేవాలయం శిల్పకళకు ప్రసిద్ధి.



### 9..3.2 పానగల్లు చెరువు

నల్గొండ జిల్లాలో పానగల్లు చెరువు ఉంది. దీనినే ఉదయ సముద్రం అని కూడా అంటారు. ఇది నల్గొండ జిల్లా నుండి 3 కి.మీ. దూరంలో ఉంది. కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడు ఈ చెరువును నిర్మించారు. ఈ చెరువు కింద వేల ఎకరాల భూమి సాగులో ఉంది. ఇక్కడే ప్రసిద్ధ ఛాయ సోమేశ్వర స్వామి దేవాలయం ఉంది.

